కుక్కల దాడులతో జనం బెంబేలు

- గుంపులుగా సంచరిస్తున్న శునకాలు
- రోడ్డెక్కేందుకు జంకుతున్న స్థానికులు
- చర్యలపై దృష్టిసారించని అధికారులు

ఐనవోలు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కలు దాడులకు తెగబడుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కుక్కలు గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా కనిపించిన చిన్నారులు, పెద్దలను సైతం వదలకుండా దాడికి దిగుతున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటే హడలిపోతున్నారు.

గుంపులుగా సంచరిస్తూ..

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కడ చూసినా గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒంటరిగా బయటకు వెళ్లాలంటే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. 50 నుంచి 100 కుక్కలు ఒకే దగ్గరికి చేరుతుండటంతో అటు వైపుగా వెళ్లే వారు జంకుతున్నారు. బైకులు, సైకిళ్లపై వెళ్లేటపుడు కుక్కలు వెంటపడుతున్నాయని, దీంతో అదుపుతప్పి గాయపడుతున్నామని పలువురు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

వైరస్ సోకిన కుక్కలతో భయం


మండల కేంద్రంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

గ్రామాల్లో సంచరించే కొన్ని కుక్కలకు వైరస్ సోకడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అవి జనావాసాల్లో తిరుగుతుండటంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు పలువురు తెలుపుతున్నారు. కుక్కలను పూర్తిగా నియంత్రించాలని ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

సర్పంచ్‌లు లేకపోవడంతో..

గ్రామస్థాయిలో సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రజలకు మరింత పెద్ద సమస్య వచ్చిపడినట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఏ సమస్యకైనా సర్పంచ్‌లు స్పందించేవారని, ప్రస్తుతం ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వందల సంఖ్యలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నా ప్రత్యేకాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మటన్, చికెన్ సెంటర్ల వద్ద మకాం వేస్తున్నా కుక్కలు.. రాత్రి సమయంలో అరుపులు చేస్తూ నిద్ర లేకుండా చేస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల కుక్కకాటు బాధితులు కూడా పెరిగినట్లు వైద్యులు తెలిపారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి



గ్రామాల్లో కుక్కల బెడద పెరిగింది. కుక్కల్లో వైరస్ వ్యాప్తి చెందుతుండటంతో ఆందోళన తప్పడం లేదు. అధికారులు దృష్టిసారించాలి. వైరస్ సోకిన కుక్కలను పట్టుకుని తరలించాలి.

- రమేశ్, మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, కక్కిరాలపల్లి

వెంటపడి కరుస్తున్నాయి



పాఠశాలకు వెళ్తున్న చిన్నారులను కుక్కల గుంపు వెంటాడి భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనాల వెంటపడుతన్నాయి. అధికారులు పట్టించుకుని కుక్కలు గ్రామంలో లేకుండా చూడాలి.

- శంకర్, కొండపర్తి, ప్రభుత్వ పాఠశాల పేరెంట్ కమిటీ సభ్యుడు

ఎటుచూసినా కుక్కలే



కొండపర్తి గ్రామంలో ఎటుచూసినా కుక్కలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో గ్రామంలోని ఇతర కాలనీలకు వెళ్లాలంటేనే భయమేస్తుంది. గ్రామంలో సర్పంచ్ లేకపోవడంతో సమస్యను పరిష్కరించే నాథుడే కనిపించడం లేదు.

- కోట కిరణ్‌కుమార్, కొండపర్తి

మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలి

- మాదన్నపేట గ్రామస్తుల రాస్తారోకో

కమలాపూర్ : మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మాదన్నపేట గ్రామస్తులు శుక్రవారం ఆందోళనకు దిగారు. హనుమకొండ నుంచి అంబాల మీదుగా పరకాలకు, పరకాల నుంచి అంబాల మీదుగా హనుమకొండకు వెళ్లే బస్సులను నడికూడ మండల కంఠాత్మకూరు వాగు వస్తోందని మాదన్నపేట మీదుగా నడుపిస్తున్న బస్సులను మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డగించి రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. హనుమకొండ నుంచి పరకాలకు వెళ్లే బస్సులను శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి గ్రామాల మీదుగా నడుపించాలని కోరుతూ ఇటీవల పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరినట్లు చెప్పారు. అయినా మాదన్నపేట మీదుగా బస్సులు నడుపించడం లేదని, ఇప్పుడు మాత్రం కంఠాత్మకూరు వాగు ప్రవహిస్తుందని తమ గ్రామం మీదుగా బస్సులు నడుపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు సదుపాయం లేకపోవడంతో తాము హనుమకొండకు వెళ్లాలంటే గూనిపర్తికి, పరకాలకు వెళ్లాలంటే శనిగరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మాదన్నపేట మీదుగా హనుమకొండ, పరకాలకు బస్సులు నడుపించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ అధికారులు, పోలీసులు నచ్చజెప్పి వారం రోజుల్లో మాదన్నపేటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ పద్మ, సీఏలు రమాదేవి, రజిత, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, రాజ్‌మహ్మద్, మహిళా సంఘాల సభ్యులు రాధ, సుగుణ, స్వప్న, రాజమ్మ, మాలతి, గ్రామస్తులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దామెర : మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వెల్లడించారు. దామెర, ల్యాదెళ్ల, వెంకటాపూర్, సింగరాజుపల్లి, ఒగ్లాపూర్, దమ్మన్నపేట, తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి గ్రామాలకు అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

కమలాపూర్ : కమలాపూర్ మండలంలోని శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్, చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. శనిగరం, గోపాల్‌పూర్, నేరెళ్ల, లక్ష్మీపూర్, గూనిపర్తి, అంబాల, శ్రీరాములపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని తెలిపారు.

వేలేరు : పీచర, మల్లికుదుర్ల, వేలేరు, నారాయణగిరి సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి తెలిపారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

పరకాల : పరకాల కోర్టులో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని జాతీయ లోక్‌అదాలత్ సభ్యులు ఓంటేరు రాజమౌళి, రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో ఇరు వర్గాల కక్షిదారులు రాజీ కుదుర్చుకుని సత్వర పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

'అమ్మ కోసం ఒక చెట్టు'

నడికూడ : 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ముస్త్యాలపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తమ తల్లులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి తల్లిపై గౌరవాన్ని వ్యక్తపరిచారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పావని, నాగరాజు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్..


ఆత్మకూరు : బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు


శాయంపేట : సూరంపేటలో..

ఆత్మకూరు : ఆత్మకూరు మండల కేంద్రంలోని మహాదేవస్వామి పంచకూట శివాలయం ప్రాంగణంతో పాటు శాయంపేట మండలంలోని సూరంపేటలో శుక్రవారం సాయంత్రం చిన్నారులు, మహిళలు బొడ్డెమ్మ ఆడారు. బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్ బిడ్డాలెందరు కోల్ అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. దీంతో బతుకమ్మ పండుగ ప్రారంభమైందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్తంగా

పంటపొలాల్లో కొండచిలువ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని రంగయ్యపల్లి కాశకాలనీలో శుక్రవారం పంటపొలాల్లో కొండ చిలువ సంచరించడంతో స్థానికులు భయాందోళన చెందారు. తమపై దాడి చేస్తుందోననే భయంతో స్థానికులు కర్రలతో కొట్టి చంపారు.

చర్య తీసుకోవాలి



పరకాల : ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కంకర విక్రయించని స్టోన్ క్రషర్స్ యజమానులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం పరకాల పట్టణ కార్యదర్శి బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీఓ డాక్టర్ నారాయణకు వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల లబ్ధిదారులకు అధికారులు మాందారిపేట సమీపంలోని మహిపాల్ క్రషర్‌ను కేటాయించారు. అయితే క్రషర్ యజమాని అందుకు నిరాకరిస్తూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. నాయకలు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్య కీలకం

పరకాల : విద్యార్థుల జీవితంలో డిగ్రీ విద్య కీలకమని కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, జంతు శాస్త్రం బీఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవభావాన్ని పెపొందించుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కల్పన, డాక్టర్ పావని, మహేందర్‌రావు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

వేలేరు : మండలంలో తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. షోడాషపల్లిలో జరిగిన మరో చోరీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. షోడాషపల్లి గ్రామానికి చెందిన కీర్తి పాపయ్య ఆస్పత్రికి వెళ్లి నాలుగైదు రోజులు అక్కడే అడ్మిట్ అయ్యాడు. అది గమనించిన దొంగలు ఇంటి కిటికీలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం చుట్టుపక్కల వారు పాపయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా ఇప్పటి వరకు జరిగిన దొంగతనాలపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీస్‌లు తెలిపారు.

అలుగు పోసిన పెద్దచెరువు



శాయంపేట : మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని సూరంపేట పెద్దచెరువు అలుగు పోసింది. దీంతో తహరాపూర్, సూరంపేట గ్రామాల నడుమ లెవల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుడంతో రవాణాకు అంతరాయం ఏర్పడింది.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన మాజీ పీసీసీ సభ్యుడు గంగారపు అమృతరావు తండ్రి ఆదాము ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి



దామెర : విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన కలిగిఉండాలని మహిళా సాధికారత మిషన్ కోఆర్డినేటర్ కల్యాణి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోషనల్ మీడియా కారణంగా విద్యార్థులు పెడదారి పడుతున్నారని అన్నారు. ప్రేమ పేరుతో బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. లైంగిక దాడుల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం తీసుకొచ్చినట్లు చెప్పారు. చదువుపై దృష్టిసారించి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఎవరైన లైంగిక వేధింపులకు గురైతే టోల్ ఫ్రీ నంబర్లు 100, 1098, 181, 1930కు ఫోన్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్, సూపర్‌వైజర్ శ్రీకాంత్, సిబ్బంది మానస, లావణ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

కమలాపూర్ : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితం నాశనం చేసుకోవద్దని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మాదకద్రవ్యాల నిర్మూలన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలకు బానిసలైతే కోలుకోవడం కష్టమని, మత్తులో అనేక దారుణాలకు పాల్పడుతన్నట్లు తెలిపారు. దీంతో చట్టం దృష్టిలో నేరస్తులుగా మారిపోతారని, వారికి సమాజంలో గుర్తింపు ఉండదని, ఉద్యోగాలు రాక జీవితం నాశనం అయ్యి దేనికి పనికిరాకుండా పోతారని హెచ్చరించారు. ఇప్పటికే మాదకద్రవ్యాల వినియోగం గ్రామస్థాయిలోకి చేరిందని, దీనిని నిర్మూలించేందుకు పోలీసు శాఖ అనేక చర్యలు చేపడుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జ్యోతి, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, చంద్రశేఖర్, శోభారాణి, కుమారస్వామి, పూర్ణ పాల్గొన్నారు.

శాయంపేట : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు విద్యార్థులు కృషి చేయాలని మండల వైద్యాధికారి సాయికృష్ణ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలనపై కళాశాల ప్రిన్సిపాల్ కోటేష్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరుగగా ఆయన హాజరై పలు సూచనలు చేశారు. ఏఎస్సై కుమారస్వామి, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్స్ ఖలీల్, రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పరకాల : మాట్లాడుతున్న ఎస్సై పవన్

పరకాల : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని ఎస్సై పవన్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

పీఎంశ్రీ పాఠశాలలో నిలిచిన వరద


దామెర పాఠశాలలో నిలిచిన వరద నీరు

దామెర : మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలో వరద నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో విద్యార్థులు శుక్రవారం ఆ నీటిలో నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లారు. చిన్నపాటి వర్షానికే పాఠశాల మైదానంలో నీరు చేరి చెరువులా మారుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైన సందర్భంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిసర ప్రాంతాల్లో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుంకిన మత్తడి..

గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గిద్దెచెరువు మత్తడి పోస్తుంది. దీంతో ఈ ఏడాది పంటలకు సరిపడా నీరు చెరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి

ఆత్మకూరు : విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని సైకియాట్రిస్ట్ ప్రహసిత్ అన్నారు. మండలంలోని నీరుకుళ్ల, చౌళ్లపల్లి పాఠశాలల్లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రహసిత్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలంటే వణికిపోతుంటారని, కానీ ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలని సూచించారు. పొగాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మానసిక ఇబ్బందులు ఉంటే టెలీమానస్ నంబర్ 14416కు ఫోన్ చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు నిర్మల, దుర్గాప్రసాద్, డాక్టర్ పుష్పలీల, వైద్య సిబ్బంది సంపత్, రాజ్యలక్ష్మి, నరేష్, లక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

- డాక్టర్ మహేంద్రకుమార్

దామెర : సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం చేయొద్దని మండల వైద్యాధికారి మహేంద్ర కుమార్ అన్నారు. కోగిల్వాయిలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇంటి చుట్టుపక్కల వర్షం నీరు నిలిచి, దోమలు వ్యాప్తిచెందితే వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా డాక్టర్లను సంప్రదించాలని అన్నారు. డాక్టర్ శాంతిప్రియ, సిబ్బంది అశోక్‌బాబు, శ్రీకాంత్, సురేందర్, కృష్ణ, సౌందర్య, భారతి, ఆశలు పాల్గొన్నారు.


వైద్యశిబిరం ఏర్పాటు చేసిన మహేంద్రకుమార్

యూరియా కోసం రైతుల పాట్లు


దామెర : పీఏసీఎస్ వద్ద బారులుదీరిన మహిళలు



వేలేరులో..

దామెర : యూరియా కోసం రైతుల పాట్లు తప్పడం లేదు. మండలంలోని ఊరుగొండ(పెద్దాపూర్) ప్రాథమిక సహకారం సంఘం (పీఏసీఎస్) వద్దకు శుక్రవారం రైతులు భారీగా తరలివచ్చారు. మహిళలు, పురుషులనే తేడా లేకుండా తరలివచ్చి క్యూ కట్టారు. ఒక బస్తా దొరికినా చాలు అంటూ పడిగాపులుగాశారు. ఆధార్, పట్టాదార్ పాస్‌పుస్తకాల ఆధారంగా రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు సొసైటీ అధికారులు తెలిపారు.

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో గల ఆగ్రోస్, గ్రోమోర్ కేంద్రాల వద్ద యూరియా కోసం రైతులు బారులదీరారు. అధికారులు ముందస్తుగా టోకెన్లు అందించి మరుసటి రోజు రావాలని పంపుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల వద్ద పనులు వదిలేసి యూరియా బస్తాల కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్నా ఒక్క బస్తా మాత్రమే ఇస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు.

గణిత ఉపాధ్యాయుల సమావేశం

ఎల్కతుర్తి : విద్యార్థులకు ఏ విధంగా పాఠాలు బోధిస్తే ఆసక్తిగా వింటారనే అనే అంశాలపై గణిత ఉపాధ్యాయులు దృష్టి సారించారు. భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కాంప్లెక్స్ స్థాయి సమావేశం జరిగింది. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంతో కూడిన మెరుగైన విద్యా బోధన, చదవడం, రాయడంతో పాటు గణిత చతుర్విధ అంశాల్లో సామార్థ్యాలు సాధించేలా మెలకువలు, పాఠ్యాంశాల బోధన విధానాన్ని ఉపాధ్యాయులు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఆర్‌పీలు అచరిత, స్టాలీన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంటల పరిశీలన

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని పత్తి, వరి, కాకర పంటలను శుక్రవారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. కొప్పూరు, రత్నగిరి గ్రామాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. పత్తి పంటలో ప్రస్తుతం వడలు, తెగులు సోకుతుందని, దాని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. కాయ కుళ్లు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 30గ్రాములు, 1గ్రామ్ స్ట్రెప్టో సైక్లిన్ పది లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరాకి ఆరు నుంచి ఎనిమిది లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు వేపనూనె (1500పీపీఎం) ఎకరాకు 300గ్రాముల చొప్పున, ఫ్లునికామైడ్ 0.25మిల్లీ లీటర్ల చొప్పున 200ల లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరాజకుమార్, డాక్టర్ విశ్వతేజ, ఏఓ పద్మ, ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

17 నుంచి 'సేవా పక్షం' చేపట్టాలి

ధర్మసాగర్ : మండలంలో సేవా పక్షం పేరుతో సేవా కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చౌదరపల్లి సతీశ్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షం పేరుతో 15 రోజులపాటు మండలంలో పలు రకాల సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. మీడియా కన్వీనర్ రమేశ్, రామకోటి, సీనియర్ నాయకులు సంపత్, రాములు, అమరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు సందీప్, శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు అనిరుధ్, యువమోర్చా అధ్యక్షుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు పక్షం రోజులు పాటు ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా నాయకుడు అమరేందర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ జన్మదినం సందర్భంగా 17న సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అలాగే మండల కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని అన్నారు. పక్షం రోజుల షెడ్యూల్‌ను కార్యకర్తలకు వివరించారు.

తాగునీటి బావిలో పిల్లి కళేబరం

నడికూడ : మండల కేంద్రంలోని మంచి నీళ్ల బావిలో పిల్లి కళేబరం కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించడంతో బావి నుంచి పిల్లి కళేబరాన్ని తొలగించి, బావిలో బ్లీచింగ్ చల్లారు. రెండు రోజుల వరకు తాగునీటికి వినియోగించొద్దని ప్రజలకు సూచించారు. తాగునీటి బావిలో తరుచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహించారు. బావిచుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

దామెర : పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ జ్యోతివలక్ష్మీదేవి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు నియమించిన గ్రామ పరిపాలన అధికారులు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. దామెరకు సురేష్, ల్యాదెళ్లకు భీష్మ, పసరగొండకు సంతోశ్, ఒగ్లాపూర్‌కు హరిప్రసాద్, ఊరుగొండకు విజేందర్, ముస్త్యాలపల్లికి చంద్రమోహన్, పులుకుర్తికి ప్రశాంత్ జీపీఓలు బాధ్యతలు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీపీఓలు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో డీటీ ఖురేషి, ఆర్ఐలు భాస్కర్ రెడ్డి, సంపత్ తదితరులు ఉన్నారు.

శాయంపేట : ప్రభుత్వం నూతనంగా ఎంపిక చేసిన గ్రామ పరిపాలన అధికారులు నియామక పత్రాలతో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణకు రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని 13 రెవెన్యూ గ్రామాలను 10 క్లస్టర్స్‌గా ఏర్పాటు చేసి ఒక్కో క్లస్టర్‌కు ఒక గ్రామ పరిపాలన అధికారిని నియమించినట్లు చెప్పారు. 10 మంది గ్రామ పరిపాలన అధికారులు విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నడికూడ : మండలానికి నూతనంగా ఏడుగురు గ్రామ పరిపాలన అధికారులు నియామకమైనట్లు డిప్యూటీ తహసీల్దార్ రాణి తెలిపారు. పులిగిళ్లకు శైలజ, కంఠాత్మకూరు, రామకృష్ణపూర్‌కు రాజు, రాయపర్తి, నర్సక్కపల్లికి నరసింహులు, నార్లపూర్, వెంకటేశ్వరపల్లికి శంకర్, నడికూడకు మౌనిక, చర్లపల్లికి పద్మ, చౌటుపర్తి, ముస్త్యాలపల్లికి కుమారస్వామి శుక్రవారం విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

ఐనవోలు : మండల కేంద్రంలోని నంది సెంటర్ వద్ద సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చుక్కయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. సీతారాం ఏచూరి సేవలను నెమరువేసుకున్నారు.